క్లుప్తంగా

గురుకులంలో జంగిల్ క్లియరెన్స్ పనులు

వంగర: మండల పరిధి మడ్డువలస డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకులంలో జంగిల్ క్లియరెన్స్ పనులు మూడు రోజుల పాటు నిర్వహించారు. పాఠశాల ఆవరణం, సిబ్బంది క్వార్టర్స్ వద్ద జంగిల్ పేరుకుపోవడంతో ఉపాధి హామీ వేతనదారులతో జంగిల్ తొలగింపు పనులు చేపట్టి శుభ్రం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ రెడ్డి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ పనులను ప్రిన్సిపాల్ జంపా రాధిక, వైస్ ప్రిన్సిపాల్ సూర్యకుమారి పర్యవేక్షించారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్‌ను హెచ్‌ఎంకు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వంగర: మండల పరిధి కొప్పర జెడ్పీ ఉన్నత పాఠశాలకు 1994 బ్యాచ్‌లో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు వైర్‌లెస్ మైక్ సెట్ వితరణగా అందించారు. రూ.15వేలు విలువ చేసే మైక్‌సెట్ పాఠశాల అవసరాలకు వినియోగం అవుతుందని భావించిన పూర్వ విద్యార్థులు కొనుగోలు చేసి పాఠశాల హెచ్.ఎం. కె.అనూరాధకు అందించారు. విద్యార్థులు సేవాభావం కలిగి ఉంటే పాఠశాలు అభివృద్ధి చెందుతాయని హెచ్‌ఎం వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎం.సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు చప్ప శ్రీనివాసరావు, సన్నిధి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గురువులకు సత్కారం



బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న ఎంఈవో తదితరులు

రేగిడి: మండల పరిధిలోని ఏవీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన 13 మంది ఉపాధ్యాయులకు శుక్రవారం ఘనంగా సత్కరించారు. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులంతా చక్కగా కృషి చేసినందువలనే మంచి ఫలితాలు వచ్చాయని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు అన్నారు. పాఠశాల హెచ్‌ఎం కొప్పర శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ సన్మాన కార్యక్రమం జరిగింది.

శానిటేషన్, తాగునీటి వనరుల పరిశీలన

బొబ్బిలి రూరల్: మండలంలో గ్రామాల్లో శానిటేషన్, తాగునీటి ట్యాంకులను ఎంపీడీవో పి.రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. పెంట, జె.రంగరాయపురం, రంగరాయపురం గ్రామాల్లోని శానిటేషన్ సేకరణ, వాటర్ ట్యాంకుల క్లోరినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడారు. నీటిని నేరుగా కాకుండా వేడిచేసి తాగాలని సూచించారు. ఇబ్బందులుంటే తెలియజేయాలని తగు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. స్థానిక సిబ్బందికి పలు సూచనలను చేస్తు తాగునీటిని వినియోగిస్తున్న ట్యాంకుల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, నిరంతర పర్యవేక్షణ అవసరమని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పరిశీలనలో ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు తెలియజేయండి

బొబ్బిలి: బొబ్బిలి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ సూచనలతో రూపొందించిన మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ మాప్ చూసి అందులో ఉన్న అభ్యంతరాలను మున్సిపల్ కార్యాలయ పని వేళల్లో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. ఇప్పటికే విడుదల చేసినన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు లోబడి దానికి సమాంతరమయిన మ్యాప్‌ను మున్సిపల్ కార్యాలయంలో వేలాడదీశారు. ఈ మ్యాప్‌ను ఆస్తులు ఉన్న, స్థానికులైన వారు పరిశీలించాలన్నారు. ఇందులో ఎటువంటి అభ్యంతరాలున్నా ఆగస్టు 4లోగా తెలియపర్చాలన్నారు. డీఈఈ కిరణ్‌కుమార్, టీపీఎస్, వార్డు ప్లానర్లు పాల్గొన్నారు.

బాలవికాస కేంద్రం ప్రారంభం



బాలవికాస కేంద్రంలో చిన్నారులు, ఫౌండేషన్ ప్రతినిధులు

బొబ్బిలి రూరల్: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రాచేరువలస గిరిజన గ్రామంలో చిన్నారుల బాలవికాస కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. సంస్థ ద్వారా సేకరించిన ఆట వస్తువులు, బోధనా పరికరాలు, పుస్తకాలను చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ కె జగన్నాధరావు మాట్లాడుతూ పట్టణాలకు దూరంగా ఉంటూ బాల్యాన్ని కోల్పోతున్న గిరిజన చిన్నారులకు ఆహ్లాదకరమైన, ఆటపాటలతో సాగే జీవనాన్ని అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల రామారావు, కృష్ణదాస్, ధర్మ ప్రచారక్ దూపం వాసు తదితరులు పాల్గొన్నారు.

కలగా మిగిలిన కాజ్‌వేలు...!

- దశాబ్దాలుగా ఎదురు చూపులు
- ఎన్ని సార్లు విన్నవించినా ప్రయోజనం శూన్యం
- విద్య, వైద్య సదుపాయాలకు దూరం అవుతున్న ప్రజలు, విద్యార్థులు



పాతరేగ, కొత్తరేగల మధ్య ఉన్న ఏడొంపుల గెడ్డపై కాజ్‌వే లేకపోవడంతో గెడ్డలో దిగి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

రామభద్రపురం: ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా.. బొబ్బిలి నియోజకవర్గంలో పలు గ్రామాలకు మధ్యలో ఉన్న నదులపై కాజ్‌వే నిర్మాణాలు కలగానే మిగిలిపోతున్నాయి. పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. వారి చిరకాల కల నెరవేరడం లేదు. కనీసం వాటి నిర్మాణాలు గురించి పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. మండలంలోని కొత్తరేగ-పాతరేగ గ్రామాల మధ్య ఏడొంపుల గెడ్డ ఉంది. స్వాతంత్ర్యం రాక ముందు నుంచి ఈ గెడ్డపై కాజ్‌వే నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వర్షం కురిస్తే చాలు మండల కేంద్రాలతో సంబంధాలు తెగిపోయే పరిస్థితి. అసలే ఈ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా ఉండడంతో అత్యవసర సమయాల్లో వైద్య సదుపాయాలు కోసం 108, 104 వంటి వాహనాలు రాలేక పోతున్నాయి. దానికి తోడుగా వర్షాకాలంలో నదులపై కాజ్‌వే నిర్మాణాలు లేకపోవడంతో మండల కేంద్రానికి, పరిసర నగరాలకు వైద్యం కోసం గర్భిణులు, ఉన్నత చదువుల కోసం విద్యార్థులు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. వర్షం వస్తే చాలు నదులు ఉధృతంగా ప్రవహించే పరిస్థితులు నెలకొనడంతో అలాంటి సమయాల్లో నీరు ఉధృతి తగ్గినంత వరకు ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోతాయని, ఒక్కోసారి ప్రాణాల మీదకు వస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దశాబ్దాల కాలంగా ఈ నదులపై కాజ్‌వే నిర్మాణాలు చేపట్టాలని వినతులు ఇచ్చినా నేతలు స్పందించడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా తాము పడుతున్న అవస్థలను పాలకులు అధికారులు గుర్తించి కాజ్‌వే నిర్మాణ పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నారు..



ప్రస్తుతం వర్షాకాలం వలన రెండు గామాల మధ్య రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో మండల కేంద్రాలకు వెళ్లాలంటే ప్రజలు పడుతున్న యాతన అంతా ఇంత కాదు. ప్రజల ఇబ్బందులను గుర్తించి అధికారులు కాజ్‌వే నిర్మాణ చేపడితే మంచిది.

– గొట్టాపు పైడిపునాయుడు, సర్పంచ్ ప్రతినిధి, పాతరేగ

పాఠశాలలకు వెళ్లడం మానేయాల్సిందే...



వర్షం కురిస్తే చాలు ఉన్నత చదువుల కోసం పాఠశాలలకు వెళ్తున్న పిల్లలు మానేయాల్సిందే. వర్షం వస్తే చాలు నీరు ఉధృతంగా వస్తుంది. దాంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. నీరు ఉధృతి పూర్తిగా తగ్గినంత వరకు మండల కేంద్రంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయినట్టే. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పాతరేగ, కొత్తరేగ మధ్య ఉన్న ఏడొంపుల గెడ్డపై కాజ్‌వే నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– యాసర్ల అప్పలనాయుడు, కొత్తరేగ

మాజీ ఎమ్మెల్యే శంబంగి పరామర్శ



వెంకటరమణ కుమారుడిని పరామర్శిస్తున్న బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చేపేన వెంకటరమణ కుమారుడిని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పరామర్శించారు. ఇటీవల వెంకటరమణ కుమారుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి గజపతినగరంలోని బీఎస్ఆర్ మూర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శుక్రవారం గజపతినగరం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయనతో పాటు బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాల సీజ్

రాజాం సిటీ: పట్టణంలో విచ్చలవిడిగా నంబరు ప్లేట్లు లేకుండా రోడ్లుపై తిరుగుతున్న ద్విచక్ర వాహనాలను సీజ్ చేస్తామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో జరిపిన వాహన తనిఖీల్లో వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. హెల్మెట్ వాడకంతో పాటు వాహన పత్రాలు కూడా ఉండాలని అన్నారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

రాజాం సిటీ: పట్టణంతో పాటు మండలంలో చేపట్టనున్న సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు చట్టం 1861లోని సెక్షన్ 30 ప్రకారం వచ్చే నెల 10వ తేదీ వరకు నెల రోజుల పాటు ఆంక్షలు ఉన్నాయని అన్నారు. ప్రజా ప్రశాంతత, శాంతి దృష్ట్యా ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనుమతి లేని ఊరేగింపులు, బహిరంగ సమావేశాలు, ర్యాలీలు, నిషేధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీలు పురోగతి సాధించాలి : ఎంపీపీ

రాజాం: గ్రామ పంచాయతీలు అభివృద్ధి బాటలో నడవాలని, మంచి పురోగతి సాధించాలని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల పురోగతిపై ఆయా గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలతో శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ పురోగతి సూచిక 2023 - 24పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పంచాయతీలు స్వయం ప్రతిపత్తి కేంద్రాలుగా మారాలని, సొంతంగా అభివృద్ధిని చేసుకోగలిగే సామర్థ్యాలు సాధించాలని సూచించారు. ఇవి జరగాలంటే ఆయా గ్రామ సచివాలయ ఉద్యోగులు ముందస్తు ప్రణాళికలు వేయాలని, అక్షరాస్యతా శాతాన్ని పెంచాలని, ఉద్యోగ, ఉపాధి కల్పన వైపు యువతను నడిపించాలని కోరారు. ప్రణాళికాబద్ధంగా నిధులు వినియోగం చేయాలని వెల్లడించారు. ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఎంఈవో యాగాటి దుర్గారావు, పలు శాఖల అధికారులు, పలు పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమల్లో కూటమి ప్రభుత్వ వైఫల్యం



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అడ్వైజరీ కమిటీ సభ్యులు పీడిక రాజన్నదొర

- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

మెంటాడ: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అడ్వైజరీ కమిటీ సభ్యులు పీడిక రాజన్నదొర అన్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ అని చెప్పి ఓట్లు దండుకున్నారని అన్నారు. కూటమి పాలనపై ఎవరు ప్రశ్నించినా, మాట్లాడినా కేసులు పెట్టి బెదిరించండని స్వయాన చంద్రబాబే అధికారులకు ఆదేశాలివ్వడం, తమ టీడీపీ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఏమీ చేయవద్దని అనడం ఎంతవరకు సమంజసమన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి రాగద్వేషాలకు అతీతంగా ఉంటానని చెప్పి ఇలా మాట్లాడడం రాజ్యాంగాన్నే అవమానించడమని అన్నారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి పథకాలు అమల్లో అర్హులందరికీ న్యాయం చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగమే తప్ప అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయిపల్లి రామారావు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సక్రమంగా ఓటర్ల నమోదు, సవరణలు : ఆర్డీవో

బొబ్బిలి రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనల ప్రకారమే ఓటర్ల మార్పులు, చేర్పులు, సవరణలు జరగాలని తప్పులు దొర్లకుండా బీఎల్‌వోలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో జేవీవీ రామ్మోహనరావు అన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన బీఎల్‌వోల శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్త ఓటరు నమోదుకు ముందు ప్రత్యక్షంగా ఆ కుటుంబాన్ని పరిశీలించాలని, వివరాలు సక్రమంగా ఉంటేనే ఓటర్లగా నమోదు చేయాలన్నారు. కొంత మందికి వేర్వేరు చోట్ల రెండేసి ఓట్లు ఉండటం వెలుగు చూస్తున్నాయని అటువంటివి పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. సంచార జాతులు, నిరాశ్రయుల ఓటర్ల నమోదులో మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓటరు తన వివరాలతో ఇచ్చిన డిక్లరేషన్ ప్రకారం తప్పుగా వివరాలిస్తే చట్ట ప్రకారం కేసులు చేయవచ్చని ఈ అంశంపై అవగాహన కల్పించాలన్నారు. శిక్షణలో తహసీల్దార్ మల్లపురెడ్డి శ్రీను, ఎలక్షన్ డీటీ బలివాడ గౌరీశంకర్‌లు పాల్గొని బీఎల్‌వోల శిక్షణను పర్యవేక్షించారు.

ఎరువులు ఇవ్వకుంటే సాగు చేసేదెలా...!

- మండల సమావేశంలో సభ్యుల ధ్వజం
- జిల్లా మంత్రి ఉన్నా ప్రయోజనం లేదు.. : ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: ఈ ఏడాది ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులను ప్రభుత్వం రైతులకు అందజేయకపోవడంతో వరి, మొక్కజొన్న తదితర పంటలు ఎలా సాగు చేసుకునేదని సభ్యులు ఆ శాఖ అధికారులపై ధ్వజమెత్తారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ దార అప్పలనర్సమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో ఏఈవో విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 25 రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ ఏడాది విత్తనాలు, యూరియా అందజేయడం జరిగిందన్నారు. వెంటనే స్పందించిన వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, బూరాడ సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు, అప్పాపురం సర్పంచ్ కరణం నిర్మల మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా వచ్చిన ఎరువులు టీడీపీ కార్యకర్తలకే అందజేస్తున్నారని ధ్వజమెత్తారు. బూరాడ రైతు సేవా కేంద్రానికి 40 టన్నుల యూరియా వచ్చినప్పటికీ సచివాలయ పరిధిలో ఉన్న రైతులకు ఇవ్వకుండా ఇతర ప్రాంత రైతులకు అధికారులు ఎరువులు విక్రయించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఏఈవో మాట్లాడుతూ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు బదిలీల కారణంగా ఎరువులు ఇండెంట్లు పెట్టలేకపోయామని, దీంతో ఈ సమస్య వచ్చిందన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కలుగజేసుకుని మండలానికి వ్యవసాయాధికారి లేకపోవడం దారుణమన్నారు. ఈ సమయంలో సంబంధిత శాఖాధికారి లేకపోతే రైతులకు ఎలా న్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జిల్లాలోనే వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నప్పటికీ ఏం ప్రయోజనమని ఎమ్మెల్సీ అన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. త్వరలో రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు అందజేయకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపడుతుందని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై జరిగిన చర్చలో ఏఈ శ్రీచరణ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో తప్పనిసరిగా పారిశుధ్య పనులు చేయాలని అన్నారు. ఈ విషయంపై వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అసలు పంచాయతీలకు ప్రభుత్వం నిధులు జమ చేయకపోతే గ్రామాలలో పారిశుధ్య పనులు ఎలా చేస్తారని అన్నారు. పంచాయతీలకు నిధులు జమ చేసే విధంగా చూడాలని ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీ విక్రాంత్ ఎంపీడీవో శ్యామలాకుమారికి సూచించారు. ఆర్‌అండ్‌బీ శాఖపై జరిగిన చర్చలో ఉంగరాడ మెట్ట, మజ్జిరాముడుపేట ప్రధాన రహదారుల వద్ద సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అప్పాపురం సర్పంచ్ కరణం నిర్మల, ఉంగరాడ ఎంపీటీసీ పిల్లా రోజ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై ఏఈ నాగభూషణ్ మాట్లాడుతూ వారం రోజుల్లో తాత్కాలికంగా ఈ రెండు చోట్ల రహదారి నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఉంగరాడమెట్ట-వన్నలి రహదారి పూర్తిగా పాడైందని చాటాయివలస ఎంపీటీసీ పాగిరి అప్పలనాయుడు ప్రశ్నించగా మరమ్మతులకోసం నిధులు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభిస్తామని ఏఈ వెల్లడించారు. మండలంలో 25 సచివాలయాలు ఉండగా ఎంత మంది ఎనర్జీ అసిస్టెంట్‌లు ఉన్నారని ఎమ్మెల్సీ విక్రాంత్ ఏఈని ప్రశ్నించారు. 14 మంది ఉన్నారని, మరో 11 చోట్ల ఖాళీగా ఉన్నాయని ఏఈ వావిలపల్లి సురేష్ తెలిపారు. ఇలా అయితే ప్రజలకు నాణ్యమైన విద్యుత్ ఎలా అందిస్తారని ఎమ్మెల్సీ అన్నారు. ఎంపీపీ దార అప్పలనర్సమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీడీవో శ్యామలాకుమారి, ఏవో నాగమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎరువులు అందడం లేదని ఏఈవోను ప్రశ్నిస్తున్న బూరాడ, అప్పాపురం సర్పంచ్‌లు శశిభూషణరావు, కరణం నిర్మల

అల్లుకున్న నిర్లక్ష్యం



తారాపురం ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు



తారాపురం గ్రామదేవత ఆలయం ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభానికి తీగలు ఇలా..



మండల కేంద్రంలోని ఆంధ్రా బ్యాంకు పక్కన ఉన్న స్తంభంపై ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలు

రామభద్రపురం మండలంలోని పలు చోట్ల జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను చూస్తే ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. తారాపురం ఆంజనేయ స్వామి ఆలయం, గ్రామ దేవత ఆలయం ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాలతో పాటు మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా శ్రీరాంనగర్ కాలనీకి దిగే మార్గం పక్కన విద్యుత్ స్తంభాలకు పిచ్చి మొక్కలు తీగలుగా అల్లుకున్నాయి. అయినా అధికారులకు పట్టడం లేదు. – రామభద్రపురం

సమతుల్యతతోనే అభివృద్ధి



బొబ్బిలిలో ప్రపంచ జనాభా దినోత్సవం

బొబ్బిలి: జనాభా సమతుల్యతతోనే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని రోటరీ జిల్లా చైర్మన్ జేసీ రాజు అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. రోటరీ క్లబ్ బొబ్బిలి కార్యదర్శి శివకాంత్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జనాభా దినోత్సవాన్ని ప్రభుత్వ ఐటీఐ విద్యార్థుల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జేసీ రాజు మాట్లాడుతూ పరిధికి మించిన జనాభా ఉంటే అభివృద్ధికి ఆటంకమవుతుందన్నారు. ఉపాధి, ఆరోగ్య,విద్యా సంబంధ అంశాల్లో అధిక జనాభా వలన అవస్థలు తప్పవన్నారు. ప్రకృతి వనరులు కూడా అందుకు సరిపడా ఉండాలన్నారు. అంతే కాకుండా నేరాల రేటు కూడా పెరిగే ప్రమాదం ఉందన్నారు. మన కుటుంబం కోసమే కాకుండా సమాజ శ్రేయస్సు కోసం కూడా కుటుంబ నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోటరీ పూర్వ అధ్యక్షుడు సింగ్రీ శ్రీనివాసన్, అధ్యాపకులు రాములప్పడు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేగిడిలో..

రేగిడి : స్థానిక పీహెచ్‌సీ వద్ద ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. వైద్యాధికారి అసిరినాయుడు, సోహిసీరాఘవ్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుందరేశ్వరరావు, సూపర్‌వైజర్ అప్పారావు, ల్యాబ్ టెక్నీషియన్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనలో కుంటుపడిన అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ రాజాం ఇంచార్జ్ తలే రాజేష్



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజాం నియోజకవర్గ ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని వైఎస్సార్‌సీపీ రాజాం ఇంచార్జ్ డాక్టర్ తలే రాజేష్ ధ్వజమెత్తారు. పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. రాజాం ప్రధాన రహదారి విస్తరణలో మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. రాజాం, రేగిడి, సంతకవిటి మండల కేంద్రాలతో పాటు మండలాల్లోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయని, డబుల్ రోడ్ల నిర్మాణం లేదని పేర్కొన్నారు. లింకు రోడ్ల అభివృద్ధి మరిచారని ధ్వజమెత్తారు. వ్యవసాయ రంగం పూర్తిగా అధోగతిలోకి వెళ్లిపోయిందని ఆరోపించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఆయనతో పాటు రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు ఉన్నారు.

26, 27 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు

బొబ్బిలి: పట్టణంలో ఈ నెల 26, 27 తేదీల్లో జరగనున్న సీపీఐ 14వ మహాసభలకు తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ర్యాలీతో పాటు జరిగే బహిరంగ సభలో సీపీఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్యలు ముఖ్య అతిథులుగా ప్రసంగిస్తారన్నారు. అభ్యుదయ వాదులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఆహ్వాన సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కండాపు ప్రసాదరావు, అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ నాయకులు పాలూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారం పరిశీలన



కోళ్ల ఫారాన్ని పరిశీలించేందుకు వచ్చిన విచారణ కమిటీ సభ్యులు

మెంటాడ: మండలంలోని బిరసాడవలసలో ఉన్న కోళ్ల ఫారాన్ని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆదేశాలతో పశు సంవర్ధక అధికారి ఎ.వి.రమణ ఆధ్వర్యంలో శుక్రవారం విచారణ కమిటీ పరిశీలించింది. కాలుష్య నియంత్రణా మండలి నుంచి ఏడీఈ శార్వాణి ఇక్కడి నీటి శాంపిల్స్‌ను సేకరించారు. డీపీవో మల్లికార్జునరావు కోళ్ల ఫారం నుంచి వ్యర్థాల వాసన బయటకు ఎలా వస్తుందో పరిశీలించారు. తహసీల్దార్ అరుణకుమారి కోళ్ల ఫారం యాజమాన్యం ఆక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చేసి అప్పగించాలని ఆదేశించారు. అనంతరం పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో ఈ కోళ్ల ఫారం పరిశీలనకు కమిటీ వచ్చిందన్నారు. కమిటీ సభ్యులంతా పరిశీలించామని, తమ రిపోర్టును క్రోడీకరించి కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

అన్నదాత సుఖీభవతో రైతులకు ఇబ్బందులు



మాట్లాడుతున్న బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు

రేగిడి: కూటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి మజ్జిరాముడుపేట గ్రామంలో విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. అన్నదాత సుఖీభవకు అర్హుల జాబితాలో పేర్లులేని రైతులు సచివాలయంలో నమోదు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అది క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని అన్నారు. రైతుల డేటా నమోదు చేస్తున్నప్పుడు కంప్యూటర్లలో నో డేటా ఫౌండ్ అని వస్తుందని వెల్లడించారు. 2019 - 24 మధ్య కాలంలో రైతు భరోసాకు అర్హులైన రైతులు ఇప్పుడెందుకు అనర్హులౌతారని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి సమాచారం సేకరించి రైతులందరికీ న్యాయం చేసిన విషయాన్ని ఇప్పుడు రైతులు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు కెంబూరు వెంకటేశ్వరరావు, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు ఉన్నారు.

వినతులపై దృష్టి సారించాలి

బాడంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యలపై పీజీఆర్‌లో వచ్చిన వినతులపై వీఆర్‌వోలు దృష్టి సారించి పరిష్కారినికి కృషి చేయాలని తహసీల్దార్ కె.సుధాకర్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలతో ఆయన ప్రత్యేకంగా శుక్రవారం సమావేశమయ్యారు. సమావేశంలో హెచ్‌డీటీ ఆర్.ధనం, వీఆర్‌వోలు పాల్గొన్నారు.